క్లుప్తంగా

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్‌స్కూల్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్టోబర్ 30వ తేదీ వరకు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు కంటి వైద్య నిపుణుడు రమేష్ తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కంటి పరీక్షల్లో 25 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికి త్వరలో ప్రభుత్వం కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



హెల్త్ వర్కర్లకు డస్ట్ బిన్స్ పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లకు పుష్ కార్ట్‌బిన్స్‌ను మంత్రి పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. దోమలకు నిలయంగా మారిన ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలో మొక్కలు పెంచి పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి విద్యను బోధించాలి



నర్సిపల్లెలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ 1 రఘురామిరెడ్డి

ఉయ్యాలవాడ: తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ 1 రఘురామిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నర్సిపల్లె ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ 2 వీర ప్రతాప్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు చక్కగా వివరించడంతో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చెన్నయ్య పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళి



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు సీపీఎం నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు తోటమద్దులు, పుల్లా నరసింహ, మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాక కేరళ రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలను నిర్మించిన చరిత్ర అచ్యుతానందన్‌దన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు బాలవెంకట్, పుల్లా నరసింహ, జైలాన్, రామరాజు, సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

శిరివెళ్ల: పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ విజయశేఖర్ అన్నారు. మంగళవారం జీనేపల్లె, వనికిదిన్నెలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినుముకు రూ.190, మొక్కజొన్న రూ. 660, వరికి రూ. 800 ప్రీమియం చెల్లించాలన్నారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఎరువు దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల వద్ద ధరలు తెలిపే బోర్డులను తప్పని సరిగా పెట్టాలని, ఎరువుల అమ్మకాలు, నిల్వలను ఎప్పటికి కప్పుడు రికార్డులలో చూపాలన్నారు. కల్తీ ఎరువులు, క్రిమి సంహారక మందులు అమ్మినట్లు రుజువైతే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు మోసాలు ఎండగడుదాం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



కూటమి సర్కారు ఎన్నికల మేనిఫెస్టోను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

- అధికారం కోసం నాడు మాయమాటలు
- ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యం
- నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి ధ్వజం

గోస్పాడు: చంద్రబాబు మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి ఎండగడుదామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజాబలం కలిగిన తమ అధినేత వైఎస్ జగన్‌కు కూటమి సర్కారు ఏమీ చేయలేదన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోస్పాడు మండలం దీబగుంట్లలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పీపీ జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శిల్పారవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలైనా ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ఎన్నికల హామీలపై ప్రశ్నిస్తే నాలుకలు ముందం అయ్యాయని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే బెదిరించే ధోరణిలో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని చెబుతున్నారని, హామీ ఇచ్చే సమయంలో ఈ విషయం కూటమి నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం శ్రీలంకలా మారుతుందని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించిన చంద్రబాబు నాయుడు నేడు చేస్తున్నదేమిటని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి పేదలకు పంచుతానని చెప్పి ఉన్నవి అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారని..ఆ సొమ్మును ఎవరికి పంచుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాడు రాష్ట్రంలో 60వేల మంది మహిళలు, బాలికలు మాయమైపోయారని అసత్య ఆరోపణలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లారన్నారు. మాయమైపోయిన వారిని ఈ కూటమి ప్రభుత్వం రక్షించి తీసుకువచ్చిందా అని ప్రశ్నించారు. మాటలు మార్చే కూటమి నాయకులను ప్రజలు గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కేసులతో గొంతు నొక్కే కుట్ర

కూటమి సర్కారు వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే శిల్పారవి అన్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి చెందిన మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి వంటి వారితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతుందన్నారు. చివరకు ఐఏఎస్, ఐపీఎస్, ఆర్‌డీఓ స్థాయి అధికారులను సైతం బాబు సర్కారు వదలడం లేదన్నారు.

దీబగుంట్లలో 466 మందికే తల్లికి వందనం

కూటమి సర్కారు తల్లికి వందనం పథకం కొందరికే ఇస్తుందని.. ప్రచారం మాత్రం గొప్పగా చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డారు. దీబగుంట్ల గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ పాలనలో తల్లికి వందనం కింద 578 మందికి లబ్ధి చేకూరగా.. కూటమి ప్రభుత్వంలో కేవలం 466 మందికే పథకం అమలైందన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. నమ్మించి మోసం చేయడమే బాబు సర్కారు పనిగా పెట్టుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్కెఫెడ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పీపీ నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రహ్లాదరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, పీపీ మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమన్, గోపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, యాసం రామసుబ్బారెడ్డి, భాస్కరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ రాజారెడ్డి, బొబ్బిటి దామోదర్‌రెడ్డి, వివేకానంద రెడ్డి, గడ్డం ప్రసాదయాదవ్, ఎంపీటీసీ భక్తవత్సల రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



చాగలమర్రిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- కూటమి సర్కారుకు ప్రజా సంక్షేమం పట్టడం లేదు
- అధికారం కోసం అన్ని వర్గాలను నమ్మించి మోసం చేశారు
- ఇంటింటికి వెళ్లి బాబు మోసాలను తెలియజేయండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం చాగలమర్రిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతి బహిరంగ సభలో సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించిన చంద్రబాబునాయుడు ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. అధికారం కోసం నాడు మాయమాటలు చెప్పారని మండిపడ్డారు. తొలి నుంచి చంద్రబాబుకు ప్రజలను నమ్మించి మోసం చేయడం అలవాటు అని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూటమి సర్కారు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఏపీని అమ్మాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడాన్ని ఆయన తప్పు బట్టారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చేటప్పుడు తెలియదా అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి పథకాలు అమలు చేయాల్సిందేనని చెప్పారు.లేకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



సమావేశానికి హాజరైన చాగలమర్రి మండల నాయకులు, కార్యకర్తలు

అమరావతి పేరుతో దోపిడీ

తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు దోచిపెట్టేందుకే రాజధాని అమరావతి పేరుతో చంద్రబాబు వ్యాపారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే రైతుల నుంచి వేలాది ఎకరాలు భూసేకరణ చేస్తున్నారన్నారు. అభివృద్ధిని గాలికొదిలేసి కేంద్రం ఇచ్చే నిధులన్నీ స్వాహా చేస్తున్నారని ఆరోపించారు.తొలి నుంచి చంద్రబాబు వెనుకబడిన రాయలసీమను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను గుర్తు పెట్టుకొని వచ్చే ఏడాదిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, సీనియర్ నాయకులు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, జగదీశ్వరరెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాష, ప్రధానకార్యదర్శి కోటా శేషురమేష్, ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, మాజీ జెడీపీటీసీ రామగుర్విరెడ్డి, సర్పంచ్‌లు తులసమ్మ, ఈదుల సరోజమ్మ, గోవిందయ్య, షరీఫ్, బాలీశ్వరరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ సభ్యుడు సీసా వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, వార్డు మెంబర్లు వి.షరీఫ్, బురాందీన్, మన్సూర్, ఫ్రూట్ షేక్షావలి, నాయకులు మల్లారెడ్డి, చాంద్‌బాష, చిన్న భికారి, బబ్లూ షోయబ్, కదిరి దస్తగిరి, రహీమాన్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు నిదర్శనం జాతీయ జెండా



ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ ఐక్యతకు నిదర్శనం మువ్వన్నెల జెండా అని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో నేషనల్ ఫ్లాగ్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ యువత ఉన్నతాశయంతో పనిచేయాలన్నారు. క్రమశిక్షణతో ఉంటే పోలీసుల అవసరం ఉండదన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. అనంతరం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ జెండాను పట్టుకొని శ్రీనివాససెంటర్, సంజీవనగర్ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మల్లికార్జునగుప్తా పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతం పెంచాలి



మంత్రిని సన్మానిస్తున్న మాల ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): ప్రస్తుత జనాభాను ప్రాతిపదికగా తీసుకొని ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ కోరారు. ఈ అంశంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి నంద్యాల కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వినతి పత్రం అందజేసి మాట్లాడారు. 1950లో జనాభాను ఆధారంగా చేసుకొని ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఆరుశాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ప్రస్తుత దేశ జనాభాలో 25 శాతం మంది ఎస్సీలు, 10శాతం ఎస్టీలు ఉన్నారన్నారు. ఈమేరకు రిజర్వేషన్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం నాయకులు గుడిపల్లి సుజిత, ఆనందస్వరూప్, మద్దయ్య, ఓబయ్య, వెంకటేశ్వర్లు, సంజీవరావు, ప్రతాప్, రాజశేఖర్, వీరేష్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేయండి



గోవిందపల్లెలో ఉపాధి పనులపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసందానం చేయాలని రైతులు కేంద్ర బృందాన్ని అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని గోవిందపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు సంతోష్ కుమార్, సూర్యకాంత్ ఫరీద్, జిల్లా డ్వామా పీడీ సూర్యనారాయణ, మండల స్థాయి అధికారులు పర్యటించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు, మినీ గోకులం షెడ్లు, చెక్‌డ్యామ్‌లు, గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఉపాధి పనుల్లో పాల్గొనే వ్యవసాయ కూలీలకు అందజేసిన జాబ్ కార్డులలో కూలీల ఫోటోలు అతికించకపోవడం, పేర్లు అందులో నమోదు చేయకపోవడం, మూడు రకాల పెన్నులతో రాయడం తదితర విషయాల్లో సిబ్బందితీరుపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే అభివృద్ధి పనులు చేసిన చోట పని పేరు, వ్యయం చేసిన నిధులకు సంబంధించి నేమ్ బోర్డులు కనిపించక పోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు సంబంధించిన రికార్డులు సరిగ్గా లేకపోవడం, ఇందుకు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో పనితీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, ఏపీడీ సాంబశివరావు, కోర్స్ డైరెక్టర్ ఏసుదాస్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ



మున్సిపల్ హైస్కూల్‌లో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ పలు చట్టాలు రూపొందించినట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమం, వైద్యారోగ్యం, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, కళాశాల అమ్మాయిలతో మహిళల సంక్షేమం, రక్షణ, భద్రత, హక్కులు, మహిళా సాధికారత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, పిల్లల భద్రతపై విస్తృత అవగాహన కల్పనలో భాగంగా మహిళా కమిషన్ ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. అడిషనల్ ఎస్పీ జావలి మాట్లాడుతూ మహిళలు, కాలేజీల్లో చదువుతున్న అమ్మాయిలు శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అలాగే ఏదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కమిషన్ సభ్యురాలు బేగం, ఐసీడీఎస్ పీడీ లీలావతి, సీడీపీఓలు, అనుబంధ శాఖల అధికారులు, కళాశాల యువతులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు చర్యలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మెరుగైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం స్థానిక కాదర్‌బాద్ నరసింగరావ్ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల, తెలుగు తల్లి ఉద్యానవనాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం తెలుగు తల్లి ఉద్యానవనం వాకింగ్ ట్రాక్‌లో కలెక్టర్ కలియ తిరిగి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈఓ జనార్దన్ రెడ్డి, కేపీఎం ప్రధాన ఉపాధ్యాయుడు అసదుల్లా హుసేన్, కార్యదర్శి దస్తగిరి, పద్మజ, సర్తాజ్, షరీఫ్, గురురాజ, ముజాహిద్, రఫీ, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

- మహిళలు శక్తి కరణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఆర్‌జీఎంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లె పండుగ నిధులు మంజూరు

శిరివెళ్ల: మండలానికి పల్లె పండుగ కింద 2వ విడతలో రూ. 1.50 కోట్లు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ రవి కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిధులను పంచాయతీల వారీగా ప్రాధాన్యత ప్రకారం కేటాయింపులు జరుగుతాయన్నారు. గోవిందపల్లెలో మొదటి విడత నిధులు రూ. 35 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.

నేడు శిరివెళ్లలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటి

శిరివెళ్ల: ఈ నెల 23వ తేదీన మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ- మోసం గ్యారెంట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. బోయలకుంట్ల, జీనేపల్లెలో జరిగే ఈకార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథరెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు జింకల నాగన్న, రఘునాథ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

అర్చకులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి

నంద్యాల(వ్యవసాయం): మునిసిపాలిటీల పరిధిలోని ప్రైవేటు దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నెలకు రూ.10వేలు పారితోషికం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ ,ఉపాధ్యక్షుడు మామిళ్ళపల్లె ప్రభాకర్ శర్మ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి కోరారు. మంగళవారం మంత్రి నంద్యాలకు వచ్చారు. విషయం తెలుసుకున్న నంద్యాల జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆడబిడ్డ నిధి అమలు చేయాల్సిందే



ఇసాక్‌బాషా

నంద్యాల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి సర్కారు ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాల్సిందేనని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ. 1500 ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే, ప్రస్తుతం మంత్రి అచ్చెన్నాయుడు ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి నేడు మడమ తిప్పడం టీడీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. వైఎస్ జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి ఇప్పుడు చేతులు ఎత్తేయడం సిగ్గుచేటన్నారు.ఆది నుంచి చంద్రబాబును నమ్మించి మోసం చేయడం అలవాటుగా మారిందని మండిపడ్డారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నంద్యాల: నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చునని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నూతనంగా ఏర్పాటు అయిన నియోజకవర్గ స్థాయి జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు శిల్పారవిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా మధు, ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అబ్రహాం, సహాయకార్యదర్శులు సాయివర్మ, ప్రదీప్, ఉపాధ్యక్షుడు గిరి, కోశాధికారి మిద్దె చార్లెస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రఘునాథరెడ్డి, అలాబకాష్, శివ,మల్లేష్ నాయక్, చోటా సింగ్, నూర్‌బాషా, నిరంజన్, భరత్ పాల్గొన్నారు.

పోటెత్తిన కుందూ



ఉయ్యాలవాడ- రూపనగుడి గ్రామాల మధ్య కుందూనది వంతెనకు సమాంతరంగా వరద నీటి ప్రవాహం

ఉయ్యాలవాడ : కుందూనదికి వరద నీటి ప్రవాహం పెరిగింది. ఇప్పటికే శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా అధికారులు కుందూనదికి 30 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. దీంతో మండల పరిధిలోని కుందూనది తీరం వెంట ఉన్న హరివరం, బోడెమ్మనూరు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, ఒంటిద్దుపల్లె, నర్సిపల్లె గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. తీరం వెంట ఉన్న కొన్ని గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లు నీట మునిగాయి. కుందూనదిలో ఉధృతి తగ్గే వరకు బట్టలు శుభ్రం చేసేందుకు రజకులు కూడా వెళ్లరాదని ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు టామ్ టామ్ వేయించారు.

దొర్నిపాడు:భారీ వర్షాలకు రోజురోజుకు కుందూ నదిలో వరద నీరు పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సుమారు 8 అడుగుల ఎత్తులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో రైతులు వరి నాట్లకు సన్నద్ధ వుతున్నారు. కుందూతీరం ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు.

తెలుగు సాహిత్యం గర్వించే మహాకవి దాశరథి

- దాశరథి శత జయంతి వేడుకల్లో వక్తలు



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాతృభాష పరిరక్షణ సమితి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): తెలుగు సాహిత్య గర్వించే మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ హయగ్రీవాచార్యులు, గౌరవ సలహాదారులు డాక్టర్ రవీంద్రనాథ్, కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి అన్నారు. డాక్టర్ దాశరథి శతజయంతి ఉత్సవాలను మంగళవారం స్థానిక కార్యాలయంలో మాతృభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాహితీ సంఘాల ప్రతినిధులు, కవులు దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం పాలనలో తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచిన గొప్పవ్యక్తి దాశరథి అని చెప్పారు. నిజాం ప్రభుత్వం జైలు శిక్ష వేసినప్పుడు బొగ్గు ముక్కతో జైలు గోడలపై పద్యాలు రాసి తెగువ చాటిన కవిగా నిలిచారన్నారు. పద్యము, కవిత్వము మహోన్నతంగా రాసిన దాశరథి వందలాది సినిమా పాటల రచయితగా తెలుగు సమాజాన్ని అలరించారని తెలిపారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల సాహిత్యంలో మంచి పట్టు కలిగిన ఆయన పీడిత ప్రజల గొంతుకగా నిలిచి తెలంగాణ సమాజంలో సాంస్కృతిక చైతన్యం రగిలించారని తెలిపారు. కవులు నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, మహమ్మద్ రఫీ దాశరథి జీవితం, సాహిత్యం పై కవితలు వినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ సహదేవుడు సుబ్బయ్య, తూము శివారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ : చాగలమర్రి మండలం గొడిగనూరు గ్రామానికి చెందిన ప్రసాద్ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. 2017లో ప్రసాద్ తండ్రి నరసింహులు, తమ్ముడు సుభాన్‌లు హత్యకు గురయ్యారు. ఈ కేసుకు సంబంధించి రూ. 30 లక్షలు రాగా వాటి పంపకంలో హత్యకు గురైన సుభాన్ భార్య, ప్రసాద్‌ల మధ్య మనస్పర్థలు రావడంతో సుభాన్ భార్య సుబ్బరత్నం పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు ప్రసాద్‌ను స్టేషన్‌కు పిలిపించి సుబ్బరత్నమ్మకు రూ. 8 లక్షలు ఇవ్వాలని చెప్పారు. అయితే భర్త హత్య జరిగిన కొన్ని రోజులకే సుబ్బరత్నమ్మకు అప్పుడే కొంత నగదు, బంగారు ఇచ్చి సెటిల్ చేసుకున్నానని ఈ డబ్బులతో ఆమెకు ఎటువంట సంబంధం లేదని చెప్పినా పోలీసులు బలవంతంగా తన చేత రూ. 8 లక్షలకు బాండు రాయించారని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు ప్రసాద్ తెలిపారు. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ తన భర్త హత్యకు గురైనా తనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని వచ్చిన డబ్బు అంతా బావ ప్రసాదే తీసుకోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నరసింహులు (58) కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డుకు చెందిన నరసింహులు ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు

తప్పిన గండి ప్రమాదం



టీజీపీ ప్రధాన కాల్వలో పడిన గండి

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన కాల్వలో పడిన గండిని మంగళవారం రుద్రవరం బెస్తకాలనీ వాసులు పూడ్చివేశారు. దీంతో ప్రమాదం తప్పడంతో రైతులు,చెరువు కింద ఉన్న కొండమాయపల్లె ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ కాలువకు నీరు వదిలారు. ప్రవాహం పెరిగితే గండి మరింత పెద్దదిగా మారి ఇబ్బంది తలెత్తే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా బెస్తకాలనీవాసులు తెలిపారు. టీజీపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదని దీంతో తామే సమస్యను పరిష్కరించుకున్నట్లు వెల్లడించారు.